# బయలు బతుకు

మాలాడ్ బొంబాయిలోని ఓ ఉపనగరం.

అక్కడో పన్నెండు అంతస్థుల భవనం కట్టడం పని చురుకుగా సాగుతోంది. ఇటుక కట్టడం అయిపోయింది. ప్లాస్టరింగ్ వర్క్ నడుస్తోంది. ఇసుకా సిమెంట్ మిక్చర్‌లో కలుపుతున్నారు. ఆ మిశ్రమాన్ని ఆడకూలీలు ఇనుప బొచ్చెల్లో తీసుకెళ్ళి మేస్త్రీలకు అందిస్తున్నారు. వారు గోడకి చల్లి చదును చేస్తున్నారు.

ఆ బిల్డింగ్‌కి ఆనుకునేలా కట్టిన కర్రల స్టాండుపై నిలబడి వారు తమ పనిని వేగంగా చేసుకుపోతున్నారు.

ఆ ఇనుప బొచ్చెలు ఒకరి చేతులనుండి మరొకరి చేతుల్లోకి మారి మేస్త్రీకి చేరటం అపూర్వ దృశ్యంలా ఉంది. దూరం నుండి చూస్తుంటే ఓ హిందీ గీతం తలపుకొస్తోంది.

"సాథిహాత్ బఢాన సాథీలే"

ఒంటి గంటయింది. పనివారంతా భోజనానికి దిగారు. మల్లమ్మ, పోశెట్టి ఆ బిల్డింగ్‌లోనే సగం కట్టిన ఓ గదిలో ఉంటారు.

మల్లమ్మ మామూలు కూలీ అయితే పోశెట్టి తాపీ మేస్త్రీ.

రాత్రి మిగిలిన చేపల పులుసుతో అన్నం తింటున్నారు. వారి కొడుకు రమేష్ బడికి వెళ్ళాడు. వాడికి ఆరు సంవత్సరాలు. తర్వాత ఓ అమ్మాయి రుక్మిణి, నాలుగో సంవత్సరం నడుస్తోంది. తల్లీ తండ్రి పనిచేస్తుంటే రుక్మిణి మిగతా పిల్లల్తో చేరి మట్టిలో

ఆడుకుంటోంది. "ఇంకో నెలలో బిల్డింగు పని పూర్తయితదట గదా మల్లమ్మ... ఇంక మనం మలబార్ హిల్‌కి పోవాలె... శేటు బిల్డింగ్ కూలగొట్టే కట్టుకుంటున్నాడు. ఈడ పనయినంక ఆడ సురూ జేత్తడట. మనం ఆయన దగ్గర పదేండ్ల నుంచి పని జేత్తున్నం గదా మనమంటే ఆయనకు నమ్మిక మనని ఆడ బయటి రూం (ఔట్‌హౌస్)లో వుండి పని చేస్తూ దేకరేక్ జేయుమన్నడు" అన్నాడు పోశెట్టి.

"ఇట్ల ఎన్నేండ్లు తిరుగుడం. యాడన్న ఒక జోపిడి(గుడిసె) సూడరాదా" మల్లమ్మ.

"జోపిడంటే మాటలా. ఎంతలేదన్నా డెబ్బై, ఎనబైవేలు కావలె. యాడికెల్లి తీసుకద్దాం."

"రమేశ్ పెద్దగయితున్నడు. ఇట్ల వూకూకె తిరుగుతె ఆడి సదువు కరాబుగాదా. ఒచ్చే యాడాది బుజ్జిని గూడా ఇస్కూలుకి పంపాల".

" ఈ పరీచ్చలయిందాకా ఓల్ల దెగ్గరన్న వుంచాల. ఆనంక అటు యాడన్న సూడాల" అన్నాడు పోశెట్టి.

"నేననేది ఈ యాడాది మాటగాదు. ఎప్పటి కోసరం. మలబార్ హిల్‌కెల్లి మాలాడ్ రావాలంటే రెండు గంటలు పడుద్ది. పొల్లగాడు వత్తాడా. ఆడనేమో తెలుగు ఇస్కూలు లేదాయే. నా కొడుకును నేనోల్ల దగ్గర ఉంచనయ్యా".

"బొంబాయిలో యాడ గుడిసె దీసుకున్నా మనకు తకిల్‌బు అయితది. మన ఇంటి దగ్గరే పని దొరుకాల్లా! ఇదే మంచిగున్నది. మన పని వున్న తాటనే ఉండేన్కి దొరుకతది. ఇక మరాఠి ఇస్కూలు జేరిపియ్యాల. అవి అన్ని తాట్ల వుంటయి."

"మన కొడుక్కు మనబాస రాకుంటే ఎట్ల" అంది మల్లమ్మ.

పోశెట్టి మాట్లాడలేదు. మల్లమ్మే అంది.

"ఆ కరుకు కారటు సదెతందుకు రావాలెగదా. బుజ్జినయితే తెలుగు ఇస్కూల్లనే ఎయ్యాల".

"ఇగో మనం బతికేదే ముస్కిలున్నది. ఇగ ఇల్లు గావాల, పిల్లగాండ్లకు సదురావాల అంటే యాడ కుదురుతది" చిరాగ్గా అన్నాడు పోశెట్టి.

" గీడ మాలాడ్ల యాభై ఏల లోపు జోపిడి దొరుకుతదట. ఈ శేటు దగ్గర పని విడిసిపెట్టుదం. 'నాక' మీద నిలుసుంటే పని దొరుకదే?" (బొంబాయిలో నాకా లేబర్ అని వుంటారు. వారు దాదాపు ప్రతి రైల్వే స్టేషన్ దగ్గర పొద్దున్నే నిలుచుంటారు. చిన్న చిన్న కాంట్రాక్టర్లూ, చిన్న చిన్న పనులు చేయించుకునేవారు ఆ రోజు కూలీ రేటు మాట్లాడుకుని తీసుకు వెళ్తారు. అయితే అన్ని రోజులూ పని దొరుకుతుందని గ్యారంటీ లేదు. దొరికినా కూలీ రేటు గిట్టుబాటు కాకపోవచ్చు. డిమాండ్ మరియు సప్లై బట్టి కూలీ ధర మారుతుంటుంది.)

"లగ్గం కాక ముందు 'నాక' మీదనే నిల్చుండేటోన్నిగదా. నెలకు పదిహేను రోజులు పని దొరుకుతె బాగాయె. తుట్టికి పావుశేరు అడుగుతరు" అన్నాడు పోశెట్టి.

"మన జిందగీ ఇట్లనే పాయె. మన పోరగండ్లనన్నా సదివిస్తే, ఆల్లకు గొంచెం ముందట దారి దొరుకుతది. నాకైతే మన పిల్లలకు తెలుగు రావాలె అని కాశ (కోరిక) వున్నది. మన తెలుగోల్లకు తెలుగు రాకపోతెట్లా".

"మనూండ్ల పెద్దపెద్ద సదూకున్నోల్ల పిల్లగాండ్లకు కూడా తెలుగురాదు. అందరు ఇంగ్లీషు ఇస్కూల్లకు ఎగబడుతున్నారు. నువ్వేమో తెలుగును బట్టుకుని యాళ్లాడుతున్నావ్. అసలు సదువు సెప్పించేదే గగనం వుందంటే ఇంక నువ్వు తెలుగు ఇస్కూలుకే పంపియ్యలంటవు".

"నువ్వేమన్నా అనయ్యా. నాకో గుడిసె జూసి వుంచు. నేను నా పిల్లగాండ్లను బట్టుకుని ఎట్లన్న బతుకుత. అవుసున్నంత సేపు మందికి ఇండ్లు కట్టుకుంట. పిల్లి తన పిల్లల్ని తింపినట్టు నేను నా పిల్లల్ని పదిండ్ల తింప. నువ్వు యాడ పనిజేసినా పొద్దూకెవరకు ఇంటికత్తే సాలు".

సంభాషణ అంతటితో ముగిసింది. రెండు గంటలు కొట్టారు. తిరిగి పనిలోకి వెళ్లారు. ఆ రాత్రి పోశెట్టి ఆలోచించడం మొదలు పెట్టాడు.

మొదట్లో ఏదో ఉబుసుపోక అంటున్నదనుకున్నాడు. కాని తన భార్యకి ఇంత పట్టుదలగావుందని తెలియదు. మల్లమ్మ మాటలు కూడా నిజమే కదా! కొన్ని వందల 'ఇండ్లు' కట్టినా వెనక్కి తిరిగితే ఏముంది. ఇంటి వారి కంటే ముందు తామే ఉంటున్నామని ఇన్నాళ్ళూ చంకలు గుద్దుకోవటమే గాని ఇదంతా భ్రమకదూ.ఫుట్‌పాత్‌పై డేరా వేసుకున్న వాడికి కూడా తనది అనే ఓ గూడుంది. వాడిని గవర్నమెంటు కూడా ఖాళీ చేయించలేదు. గట్టిగా చేయించినా ఇంకో చోట 'చోటు' చూపిస్తుంది. మరి తనో!

ఇలానే ఆర్నెల్లకో సంవత్సరానికో కట్టే బిల్డింగు మారినప్పుడల్లా ఇల్లు మారాల్సిందే. అన్నీ తనవే. అయితే ఏదీ తనది కాదు.

మల్లమ్మ అన్నట్లు వెంటనే గుడిసె చూడాలి. అవసరమైతే శేటును బతిమాలి కొంత అప్పు తీసుకోవాలి. మల్లమ్మనీ, పిల్లలను ఆ ఇంట్లో వుంచి తను ఎక్కడ పనుంటే అక్కడికి వెళ్ళాలి. రాత్రికి ఇంటికి చేరుకోవాలి. ఇదంతా కష్టమే. కానీ తనవారికి ఓ గూడు దొరుకుతుంది. మల్లమ్మకి ఏదో పని దొరక్కుండా పోదు".

అలా అనుకోగానే పోశెట్టి మనసు శాంతించింది.

మల్లమ్మని దగ్గరికి తీసుకుంటూ చెవిలో గుసగుసగా తన నిర్ణయం చెప్పాడు.

మల్లమ్మకెందుకో కళ్ళు చెమర్చాయి.

రాత్రంతా వారిద్దరికీ కలలు. కలలోనే కలవరింతలు. ★